ఈనాడు మంచిర్యాల

శుక్రవారం అక్టోబరు 18, 2024

ఆదికవి వాల్మీకి ఆదర్శ మూర్తి




వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్

ఏసీసీ, న్యూస్‌టుడే: ఆది కవి వాల్మీకి అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి అని కలెక్టర్ కుమార్ దీపక్ కొనియాడారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా శాఖల అధికారులతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించారు. రత్నాకరుడు అనే బోయవాడు ఆదికవి వాల్మీకిగా మారి సీతారాముల చరిత్రను, మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం ద్వారా ప్రపంచానికి తెలియపరిచాడన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా శాఖల అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అల్లరి మూకలపై ఉక్కుపాదం మోపుతాం

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బందులు కలిగించే అల్లరి మూకలపై ఉక్కుపాదం మోపుతామని డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. వారు ఏ పార్టీకి సంబంధించిన వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. కొద్దిరోజులుగా జరుగుతున్న దాడులకు కొన్ని పాత కక్షలు ఉన్నాయని, మరికొన్ని వాటిపై జరిగిన గొడవలకు కారకులైన వారిపై కేసులతో పాటు అరెస్టులు చేశామన్నారు. జూన్ నుంచి ఈ నెల 17 వరకు గంజాయికి సంబంధించి 27 కేసులతో పాటు 82 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయికి అలవాటు పడిన 37 మందిని డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నామని, 194 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇటీవల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇంటి వాచ్‌మెన్‌పై జరిగిన దాడికి గల కారకులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం పనిచేస్తుందన్నారు. ఎవరైనా ప్రజలకు భయభ్రాంత్రులకు గురి చేసినట్లు ప్రవర్తిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఏసీపీ ప్రకాష్, మంచిర్యాల గ్రామీణ సీఐ అశోక్, ఎస్సైలు పాల్గొన్నారు.

అడవి బిడ్డ నినాదం.. అభివృద్ధి విధానం





ప్రజా దర్బార్‌లో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, వెడ్మబొజ్జు, మాజీ మంత్రి వేణుగోపాల చారి, భీం మనవడు సోనేరావు, కలెక్టర్, ఐటీడీఏ పీవో, తదితరులు

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఆసిఫాబాద్: జల్.. జంగల్.. జమీన్ నినాదమే లక్ష్యంగా పోరు సాగించిన కుమురంభీం వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. రాజకీయాలకతీతంగా మంత్రి సీతక్క సహా కాంగ్రెస్, భాజపా, భారాస ప్రజాప్రతినిధులు దర్బార్‌లో కలిసి పాల్గొనటం కొత్త ఒరవడికి కేంద్ర బిందువుగా నిలిచింది. మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహా వివిధ సంఘాల బాధ్యులు ప్రసంగించారు. ఆదివాసీల జీవన విధానం, అభ్యున్నతి, పోడుభూమి సమస్య పరిష్కార కోసం కృతనిశ్చయంతో పనిచేయాలని, ఏజెన్సీలో రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం సహా మౌలిక వసతులు కల్పించాలని, భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సమాలోచనలతో దర్బార్ సాగింది. ఆదివాసీల సంప్రదాయ రీతిలో కుమురంభీం సహా కుమురం



హాజరైన జనం

జోడేఘాట్‌లో కుమురంభీంకు ఘన నివాళి

సూరు విగ్రహాలకు నివాళులర్పించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా భీం జీవిత చరిత్రను వెల్లడించేలా సీడీని విడుదల చేసి గోండి భాషలో ప్రసంగించడం ఆదివాసీల్లో ఉత్తేజాన్ని నింపింది. గతేడాదితో పోల్చితే ఈ దఫా జనప్రవాహం కాస్త తగ్గింది.

◆ **ఎంపీ నగేష్ మాట్లాడుతూ..** నాలుగేళ్ల నుంచి ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం జరగడం లేదని వెంటనే నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ. . పుస్తకాల్లో భీం చరిత్ర చదివానని, ఇక్కడ పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. భీం మనవడు సోనేరావు మాట్లాడుతూ.. భీం పోరాటంతోనే గుర్తింపు వచ్చిందన్నారు. కానీ ఆదివాసీలకు మాయ మాటలు చెప్పి తప్పుడు పట్టాలు ఇవ్వకుండా చూడాలన్నారు.

◆ **ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ..** గిరి వికాసం కింద ఆదివాసీ భూముల్లో బోర్లు వేయించాలని, కుమురంభీం కట్ట, వట్టివాగు ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. జైనూర్ ఘటన బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం, కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని, అక్కడ 144 సెక్షన్ ఎత్తివేయాలన్నారు.

◆ **ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ..** బీడు, అటవీ భూముల్లో జీడీ మొక్కల పెంపకంతో ఉపాధి లభిస్తుందన్నారు. దసలిపట్టు సాగు రైతులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, దీన్ని నివారించాలన్నారు.

◆ **ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ** జోడేఘాట్‌కు మధ్యలో అటవీ అనుమతి లేక నిలిచిన 6 కి.మీ. రోడ్డును వచ్చే వర్ధంతి వరకు పూర్తి చేసేలా చూస్తాం

◆ **ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ** 12 పోరు గ్రామాల్లోని 350 మంది ఆదివాసీలకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏల్లో 28 శాఖలు పనిచేయాల్సి ఉండగా కొన్ని మాత్రమే చేస్తున్నాయన్నారు. వీటిని బలోపేతం చేయాలన్నారు.



మొక్కుతున్న కుమురంభీం మనవడు సోనేరావు కుటుంబ సభ్యులు



ఆదివాసీల గుస్సాడీ నృత్యం

భీం పోరాటంతోనే గిరిజన చట్టాలు : మంత్రి సీతక్క

ఆదివాసీల హక్కుల కోసం చేపట్టిన కుమురం భీం పోరాట ఫలితమే గిరిజన చట్టాల రూపకల్పనకు దారి తీసిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీలకు అండగా నిలిచే స్వయం ప్రతిపత్తి కలిగిన ఐటీడీఏలు కొన్ని నిర్వీర్యమైన విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామని, వాటికి నిధులు కేటాయించి జవసత్వాలు తెస్తామన్నారు. కొన్నిచోట్ల అటవీశాఖ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యం చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భీం నెత్తురోడిన ఈ ప్రాంతంలో భూమి ఆక్రమణలు కాకుండా చూడాలని, 12 పోరు గ్రామాల ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం నివేదికలు తయారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడ పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు ఇప్పిస్తామన్నారు.

ఐటీఐలు.. ఉపాధికి బాటలు

● నూతన కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



మందమర్రిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే

రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునికతను అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధంగా ఉన్నా ప్రభుత్వ ఐటీఐ, కళాశాల్లో ఇలాంటి వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో లేవు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి పట్టణాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ప్రభుత్వ ఐటీఐలో కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆరు నూతన కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 19 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

మందమర్రి ఐటీఐలో మాత్రమే..

జిల్లాలో మందమర్రి, నస్పూరు, మంచిర్యాల, జన్నారంలో ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. కానీ మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో మాత్రమే నూతన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం, టాటా కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇక్కడ విశాల స్థలం, సింగరేణి ప్రాంతం కావడం.. యువతలో ఆసక్తి ఉండటంతో మొగ్గు చూపారు. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సుల్లో 95 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

రూ.4 కోట్లతో కొత్త భవనం

మందమర్రి ప్రభుత్వ ఐటీఐ వెనకాల ఖాళీ స్థలం ఉండటంతో ప్రభుత్వ భాగస్వామ్యంతో టాటా టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీ రూ.4 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనం పూర్తయితే నూతన హంగులతో నిర్మిస్తున్న గదుల్లో ఆధునిక పద్ధతిలో తరగతులు బోధించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అప్పటి వరకు ప్రస్తుత ఐటీఐ భవనంలోనే తరగతులు ప్రారంభిస్తారు. ఇందుకోసం ఎంపిక చేసిన అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం

నూతన కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా టాటా కంపెనీ, మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు సమాచారం.

విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు

పది, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు జూన్, జులై మాసాల్లోనే ఉన్నత చదువుల కోసం కళాశాలల్లో ఇప్పటికే చేరి ఉంటారు. నూతన కోర్సుల్లో చేరేందుకు ఇప్పుడు దరఖాస్తులను ఆహ్వానించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఇతర కోర్సులు పూర్తి చేసి ఉద్యోగం, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారు, పది ఉత్తీర్ణత సాధించి ఎందులో చేరని వారు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు 40 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు.



నూతన కోర్సులో చేరేందుకు దరఖాస్తు ఇస్తున్న విద్యార్థి

సద్వినియోగం చేసుకోండి

నూతన కోర్సుల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. చాలా మంది చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక కోర్సులను నేర్చుకోవడం ద్వారా త్వరగా ఉపాధి దొరుకుతుంది. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- దయానంద్, ఐటీఐ ప్రిన్సిపల్, మందమర్రి

■ కోర్సు ■ సీట్లు ■ కాల పరిమితి

కోర్సు	సీట్లు	కాల పరిమితి
మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమెటిక్	40	ఏడాది
ఇండస్ట్రియల్ రోబోటిక్, డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నీషియన్	40	ఏడాది
ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్	20	ఏడాది
బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్ (మెకానిక్)	24	రెండేళ్లు
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	24	రెండేళ్లు
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్	24	రెండేళ్లు

తిప్పేశ్వర్‌లో పర్యటన.. కవ్వాల్ అభివృద్ధికి ఆలోచన

● మహారాష్ట్రలో మంచిర్యాల అటవీశాఖ అధికారుల అధ్యయనం

న్యూస్‌టుడే, జన్నారం: మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ పులుల సంరక్షణ కేంద్రంలో మంచిర్యాల అటవీశాఖ అధికారుల బృందం గురువారం పర్యటించింది. అక్కడి అందాలను తిలకించడంతోపాటు ఆ ప్రాంతంలోని స్థానిక గిరిజనులకు కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పథంలో కొనసాగుతున్న తిప్పేశ్వర్ అభయారణ్యంలో చేసిన పనులను కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోనూ చేపట్టాలనేది మన అటవీశాఖ అధికారుల ఆలోచన. మంచిర్యాల డీఎఫ్‌ఓ శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఎఫ్‌డీఓ సర్వేశ్వర్‌తో కలిసి మంచిర్యాల, లక్షెట్టిపేట రేంజి అధికారులు రత్నాకర్‌రావు, అత్తే సుభాష్, డిప్యూటీ రేంజి అధికారి అబ్దుల్ అజార్ బృందం సభ్యులు తిప్పేశ్వర్‌లోని పలు ప్రాంతాలను సందర్శించి పర్యాటక ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి పరిచారో తెలుసుకున్నారు.

తిప్పేశ్వర్ అభయారణ్యంలో బయాలాజిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రంజాన్ విరాణితో కలిసి అటవీ ప్రాంతంలో పర్యటించారు. సఫారీలో ప్రయాణిస్తుండగా నడక దారిలో వెళుతున్న పెద్ద పులిని అటవీశాఖ రేంజి అధికారి కెమెరాలో బంధించారు. పర్యాటకంగానూ అక్కడ చేపట్టిన అభివృద్ధి పనుల మీద బృంద సభ్యులు అధ్యయనం చేశారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రానికి, తిప్పేశ్వర్ అభయారణ్యానికి ఉన్న తేడాలను నోట్ చేసుకున్నారు. అక్కడ చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనులను కవ్వాల్‌లోనూ చేసేలా నివేదికలను తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లుగా అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు.




తిప్పేశ్వర్‌లో అధికారుల బృందం



అటవీశాఖ అధికారుల బృందం తీసిన పెద్దపులి ఫొటో

గిరిజనుల ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అధ్యయనం చేశాం



తిప్పేశ్వర్ అభయారణ్యంలోని గిరిజనులకు కల్పించిన ఉద్యోగ, ఉపాధి అవకాశాల మీద అధ్యయనం చేశాం. ఇక్కడి పునరావాస కాలనీల్లోనూ చేసిన అభివృద్ధి పనులను పర్యవేక్షించాం. ఇక్కడి పనులను పరిశీలించి వాటిని కవ్వాల్‌లో చేపట్టాలనేది మన అధికారుల ఆలోచన. అందుకు తగినట్లుగానే బృందాన్ని ఏర్పాటు చేసి తిప్పేశ్వర్‌కు పంపించారు. పూర్తి స్థాయి అధ్యయనం చేసి నివేదికలను సమర్పిస్తాం. **- అత్తే సుభాష్ రేంజి అధికారి, లక్షెట్టిపేట**

రక్తనిధి కేంద్రానికి అధునాతన యంత్రాలు

● రూ. 60 లక్షల విలువైన పరికరాలు, బొలెరో వాహనం

న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ : జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేయూతనందించింది. 2024-25 సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా రూ.60 లక్షల విలువైన అధునాతన పరికరాలు ఫుల్లీ ఆటోమేటెడ్ ఎలిసా ప్రాసెసర్, ఎలిసా రీడర్, బ్లడ్ కలెక్షన్ మానిటర్, బ్లడ్ ట్యూబ్ సీలర్, బ్లడ్ స్టోరేజ్ రిఫ్రిజిరేటర్‌తో పాటు శిబిరాల నిర్వహణ కోసం సామగ్రి తరలింపు, సిబ్బంది కోసం బొలెరో కాంపర్ వాహనాన్ని అందించారు. ప్రస్తుతం ఆయా యంత్రాల వినియోగానికి టెక్నీషియన్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటి సేవలను త్వరలోనే అధికారికంగా ప్రారంభించేందుకు దాతలు, సొసైటీ సభ్యులు సన్నద్ధమవుతున్నారు.



రక్తం నిల్వ చేసే ఫ్రిడ్జ్



ఎలిసా ప్రాసెసర్

పని సులువు.. నిర్ధారణ మెరుగు

ఐఓసీ అందించిన వాటిలో ఆటోమెటిక్ ఎలిసా యంత్రం మెరుగైన పనితీరును కనబరచనుంది. ఆయా నమూనాలను సిద్ధం చేసే సిబ్బందికి పని భారం తగ్గించడంతో పాటు కచ్చితమైన ఫలితాన్ని తెలియజేయనుంది. ఇందులో హెచ్ఐవీ, హెపటైటీస్-డీ, సీ, సిఫ్లిక్స్, డెంగీ, మలేరియా, థైరాయిడ్, బీ12, విటమిన్-డీ తదితర పరీక్షలు నిర్వహించవచ్చు. ఒకేసారి 92 నమూనాలను పరీక్షించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పాటు మొన్నటి వరకు శిబిరాల నిర్వహణ అనంతరం రక్తం యూనిట్లకు సంబంధించిన ప్యాకెట్లను భద్రపరిచేందుకు సరిపడా ఫ్రిజ్ లేకపోవడంతో కొంత ఇబ్బంది కలిగేది. ప్రస్తుతం ఈ సంస్థ 2+8 ఉష్ణోగ్రతతో కూడిన బ్లడ్‌స్టోరేజ్ ఫ్రిజ్ అందించడంతో సమస్య తీరింది. దాదాపు నాలుగు వందల ప్యాకెట్లను భద్రపరచవచ్చు.



ఎలిసా రీడర్, రక్త సేకరణ సామగ్రి



శాంతిఖని గనిలో గైర్హాజరీ కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు (పాతచిత్రం)

మంచిర్యాల జిల్లా పరిధిలోని ఓ భూగర్భ గనిలో పని చేస్తున్నది 85 శాతం యువ కార్మికులే. కానీ అత్యధిక కార్మికులు గైర్హాజరీ శాతం ఉన్న గని ఇదే. ఒక్కో షిఫ్ట్‌లో 150 మంది కార్మికులు ఉంటే 70 నుంచి 90 మంది కార్మికులే నిత్యం విధులకు హాజరవుతున్నారు. పండగలు, ఇతరత్రా సమయాల్లో ఒక్కోసారి షిఫ్ట్‌ను నడిపించేందుకు సరిపడా కార్మికులు హాజరుకాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి ఉత్పత్తిపై ప్రభావం చూపిస్తోంది.

డిపెండెంట్ ఉద్యోగావకాశం ద్వారా ఓ యువ కార్మికుడు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తి కావొస్తోంది. కానీ నేటివరకు ఏ ఒక్క ఏడాది కూడా 190/240 మస్టర్లు చేయలేదు. ఏటా 100 నుంచి 150 మస్టర్లతోనే సరిపెడుతున్నాడు. నేటికీ శాశ్వత ఉద్యోగిగా అర్హత సాధించలేదు. ఉన్నత విద్యనభ్యసించి పట్టణంలో కొలువు చేసిన అతను దాన్ని వదులుకొని సింగరేణిలోకి రావడం, భూగర్భ గనిలో శ్రమతో కూడిన పనులు ఉండటం వల్ల నిత్యం విధులకు గైర్హాజరవుతున్నాడు.

మార్పు తెచ్చేలా.. ఉత్పత్తి సాధించేలా!

సింగరేణిలో యువ కార్మికుల సంఖ్య పెరిగినప్పటికీ గైర్హాజరీ సమస్య తగ్గడం లేదు. ఈ పరిస్థితి ఉత్పత్తిపై పడి సంస్థ నష్టాల్లోకి వెళ్లేందుకు దారి తీస్తోంది. దీనిపై దృష్టిసారించిన యాజమాన్యం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల పరిధిలోని ఉపరితల, భూగర్భ గనుల్లో కలిపి సుమారు 14,600 మంది సింగరేణి కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 20 నుంచి 45 సంవత్సరాల వయసు వారే 70 శాతంపైగా ఉన్నారు.

● గైర్హాజరీ తగ్గించేందుకు సింగరేణి యాజమాన్యం చర్యలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

డిపెండెంట్ ఉద్యోగావకాశాల ద్వారా జిల్లాలో వందల సంఖ్యలో యువ కార్మికులు సింగరేణిలోకి వచ్చారు. కానీ వారిలో 50 నుంచి 60 శాతం మంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని యాజమాన్యం గుర్తించింది. భూగర్భ గనుల్లో కాకుండా ఉపరితలంలో పని చేసేందుకే వీరు ఆసక్తి చూపడం ఇందుకు కారణమే. కొత్తగా సంస్థలో చేరిన కార్మికుడు తప్పనిసరిగా అయిదేళ్లు భూగర్భ గనిలో పనిచేయాలనే నిబంధనను యాజమాన్యం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాదిలో 100 మస్టర్లు నిండని వారికి సింగరేణి యాజమాన్యం ఏటా ఆయా ఏరియాల్లోని జీఎం కార్యాలయాల్లో కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తోంది. మూడేళ్ల పాటు 100 మస్టర్లు నింపకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని చెబుతున్నా మారుతున్న కార్మికుల సంఖ్య స్వల్పంగానే ఉంటోంది.

మూడు రోజులకు మించితే..

మూడు రోజులకు మించి సెలవులు పెట్టకుండా గైర్హాజరైన కార్మికులు తరువాత విధులకు హాజరు కావాలంటే తప్పనిసరిగా జీఎం నుంచి అలో స్లిప్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. దీర్ఘకాలికంగా విధులకు హాజరు కాని వారిని విధుల్లోంచి తొలగించేందుకు సీఎండీ బలరాం ఆదేశాలివ్వడం సింగరేణిలో చర్చనీయాంశంగా మారింది.

19న జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం: పాఠశాల క్రీడా సమాఖ్య ఈ నెల 19న అండర్-14 బాలికల విభాగంలో ఖో-ఖో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు వేమనపల్లి మండలం నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా ప్రకటనలో తెలిపారు. 01-01-2011 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 99892 57922 నంబరుకు సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

న్యూస్‌టుడే, లక్సెట్టిపేట

? లక్సెట్టిపేటలోని ఆర్టీసీ బస్టాండులో మూత్రశాలల నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారాయి. **- గోళ్ల సత్యనారాయణ, ప్రయాణికుడు**

✔ తక్షణమే శుభ్రం చేయించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. **- శ్రీరాం జనార్దన్, ఆర్టీసీ డిపో మేనేజర్, మంచిర్యాల**

న్యూస్‌టుడే, రామకృష్ణాపూర్

? క్యాతనపల్లి పుర పరిధిలోని 14వ వార్డులోని వరద నీటి కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. **- స్థానికుడు, క్యాతనపల్లి**

✔ సమస్యాత్మక ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- ప్రదీప్ కుమార్, ఇఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, క్యాతనపల్లి**

స్పందించి..పిచ్చి మొక్కలు తొలగించి

వందనం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : క్యాతనపల్లి పురపరిధిలోని ఒకటో వార్డు తారకరామాకాలనీలో మురుగు కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దోమల వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్న దుస్థితిపై గురువారం మేమున్నాం..మీకు తోడుగాలో ప్రచురితం అయ్యింది. ఈ సమస్యపై పట్టణ పుర కమిషనర్ మురళీకృష్ణ స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కాలువలో పిచ్చి మొక్కలు తొలగించారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ్

రాష్ట్ర స్థాయికి పలువురి ఎంపిక

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు విద్యాశాఖ సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్-2024 జిల్లా స్థాయి పోటీలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని సైన్సు సెంటర్‌లో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన పోటీలు గురువారంతో పూర్తయ్యాయి. భవిష్యత్తు తరాలకు సంప్రదాయ కళలపై అవగాహన కల్పించేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తుండగా నృత్యం, వోకల్ మ్యూజిక్, వాయిద్య సంగీతం, డ్రామా, సంప్రదాయ కథలు, థియేటర్ విజువల్ ఆర్ట్స్ వంటి ఆరు కళా విభాగ అంశాల్లో పోటీలను ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 9, 10, ఇంటర్ విద్యార్థులు 175 మంది పాల్గొన్నారు. పోటీల్లో విద్యార్థుల శాస్త్రీయ, జానపద నృత్యాలు, నాటిక ప్రదర్శనలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని విజేతలుగా ఎంపికచేయగా విద్యాశాఖ అధికారులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యాశాఖ సమన్వయ కర్త సత్యనారాయణ, చౌదరి, శ్రీనివాస్, మధుబాబు న్యాయనిర్ణేతలు, పలువురు గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు

● **గాత్రం:** సరిత (ప్రథమ స్థానం, కేజీబీవీ మంచిర్యాల), ఉషారాణి(ద్వితీయ, సాంఘిక సంక్షేమ గురుకులం లక్సెట్టిపేట), రాజేశ్వరి (తృతీయ, కేజీబీవీ బెల్లంపల్లి)

● **వాయిద్య సంగీతం :** వరుణ్ బృందం (ప్రథమ, జెడ్పీహెచ్ఎస్, సబ్బేపల్లి), జెన్నిసి బృందం (ద్వితీయ, సాంఘిక సంక్షేమ గురుకులం లక్సెట్టిపేట), భూమిక్ బృందం (తృతీయ, తెలంగాణ ఆదర్శ పాఠశాల మంచిర్యాల)

● **నృత్యం :** జి.సహస్ర (ప్రథమ, స్లేట్ హై స్కూల్ జన్నారం), త్రిలోక్య (ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్, సబ్బేపల్లి), శ్రీహిత (తృతీయ, కేజీబీవీ తాండూరు)

● **డ్రామా :** రమ్య శివరాం (ప్రథమ, జెడ్పీహెచ్ఎస్, ముత్యంపల్లి), నేహాశ్రీ లోహిత్ (ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్, సబ్బేపల్లి), శృతి బృందం (తృతీయ, జెడ్పీహెచ్ఎస్, వెల్గనూర్)

● **సంప్రదాయ కథలు:** నరేందర్, బిందు ప్రియ (ప్రథమ, జెడ్పీహెచ్ఎస్, ముత్యంపల్లి), అరవిందరాణి (ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్, కిష్టాపూర్), ప్రజ్ఞ (తృతీయ జెడ్పీహెచ్ఎస్, సబ్బేపల్లి)

● **విజువల్ ఆర్ట్స్ :** ఎం.వాస్తవ్ (ప్రథమ, అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మంచిర్యాల), బి.మణికుమార్ (ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్, బాలురు మంచిర్యాల), డి.హారిక (తృతీయ, కేజీబీవీ, జన్నారం)



జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

మైక్రో ఏటీఎంతో మోసాలు ఎన్నో?

కోటపల్లి, న్యూస్‌టుడే : కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలోని నిరక్షరాస్యుల ఖాతాదారుల ఖాతాల నుంచి సొమ్మును తన ఖాతాలోకి వేసుకున్న నిందితుడు సాయిరెడ్డి ఉదంతం వెలుగుచూడటంపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. కొండంపేట్ గ్రామానికి చెందిన గావిడి భీమయ్య అనే ఖాతాదారుడి ఖాతా నుంచి సాయిరెడ్డి రూ. 59 వేలు తన ఖాతాలోకి మళ్లించుకున్నాడని స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటన నేపథ్యంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. సదరు వ్యక్తిచేతిలో మరి కొంత మంది బాధితులు మోసానికి గురైనట్లు తెలుస్తున్న నేపథ్యంలో పోలీసులు గురువారం బ్యాంకు అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. కొండంపేట్, నాగంపేట్, నక్కలపల్లి, మల్లంపేట్ తదితర గ్రామాలకు చెందిన ఖాతాదారుల ఖాతాల నుంచి సుమారు. రూ. 6 లక్షల వరకు స్వాహా అయినట్లు గుర్తించగా మైక్రో ఏటీఎంతో ఇంకా ఎంతమంది ఖాతాల నుంచి నగదును మళ్లించాడనేది పోలీసుల దర్యాప్తులో నిగ్గుతేలనుంది.

మార్కెట్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

మంచిర్యాల పట్టణం : మంచిర్యాలలోని మార్కెట్ రోడ్డును గురువారం రాత్రి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి ఇటీవల దుకాణాల ముందు ఉన్న అక్రమ షెడ్లను తొలగించారు. రహదారిపై ఉండే తోపుడు పండ్ల బండ్లను మరో వీధిలో వరుసలో పెట్టించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, టీపీఎస్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



కుమురంభీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు, అధికారులు

ఆదివాసీల హక్కుల సాధనకు కృషి

తాండూరు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ గోండు బెబ్బులి కుమురంభీంను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల హక్కుల సాధనకు కృషి చేయాలని కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ అన్నారు. గురువారం తాండూరు మండల కేంద్రమైన ఐబీలో కొమురంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తాండూరు ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, మాజీ సర్పంచి మణికుమార్, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి చౌరస్తా వద్ద ఉన్న భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు రాయిసిడాం కాశీ, అడాయి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ : జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో కుమురంభీం చిత్రపటానికి విద్యార్థులతో కలిసి టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు.

నేర వార్తలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాజేశ్

కాసిపేట, న్యూస్‌టుడే : సిద్దిపేట జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పట్టణానికి చెందిన రాజేశ్ కార్వా (35) బుధవారం రాత్రి బెల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా సిద్దిపేట దాటిన తర్వాత ఆయన ప్రయాణిస్తున్న కారు గురువారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశ్‌కార్వా అక్కడికక్కడే మృతి చెందాడు.

మంచిర్యాలలో...

మంచిర్యాలనేరవిభాగం: జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ కథనం మేరకు. .. బుధవారం రాత్రి వందఫీట్ల రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఏటకారి వెంకటేష్ (38)ను మంచిర్యాల నుంచి సీసీసీ వైపు వస్తున్న ఆటో వేగంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన వెంకటేష్‌ను కుటుంబసభ్యులు స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య సృజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



రాయమల్లు

జన్నారం, న్యూస్‌టుడే : బతుకు దెరువు కోసం ఇరాక్ వెళ్లిన యువకుడు అక్కడ జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుని చివరి చూపు కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు ఎట్టకేలకు ఆ అవకాశం దక్కింది. మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు (36) ఏడేళ్ల క్రితం ఇరాక్ వెళ్లాడు. ఈ ఏడాది ఆగస్టు 21న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఇరాక్‌లో ఉన్న నిబంధనలు పూర్తి చేసుకొని గురువారం రాయమల్లు మృతదేహం ఇంటికి చేరింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇరాక్ నుంచి మృతదేహాన్ని తీసుకు రావడానికి చింతగూడ గ్రామానికి చెందిన బత్తుల ఎల్లస్వామి, తాజా మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌కుమార్, ఇరాక్‌లో ఉంటున్న మరికొందరు యువకులు సహకరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

భీమారం, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన వివాహిత బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త బండి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాములు తెలిపారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న మద్యం పట్టివేత

కోటపల్లి: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కోటపల్లి పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల దృష్ట్యా సరిహద్దులో ఇవతలి ప్రాంతాల నుంచి పొరుగు రాష్ట్రానికి నగదు, మద్యం తరలకుండా చేపట్టే తనిఖీల్లో భాగంగా గురువారం ఎదుల్లబంధం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోతో పాటు బొలేరో వాహనం పట్టుబడిందని పేర్కొన్నారు. సుమారు రూ.3 లక్షలకు పైగా మద్యం ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులతో పాటు చోదకునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

భీమిని, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు... రాజారం గ్రామానికి చెందిన దుర్గం సాయికృష్ణ గురువారం కేస్లాపూర్‌లోని అత్తగారింటికి వెళ్లి వస్తున్నాడు. చిన్నగుడిపేట గ్రామానికి చెందిన అంజి వడాల గ్రామం నుంచి వెళ్లే క్రమంలో కేస్లాపూర్, వడాల గ్రామాల మధ్య ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్సకు మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సమయ పాలన పాటిస్తూ నాణ్యమైన బోధన చేయాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యమైన విద్యా బోధన చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. గురువారం మందమర్రి యాపల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలు, రిజిస్టరు, మందుల నిల్వల రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కార్యాలయ రికార్డులతో సరిచూసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ కళాశాలను సందర్శించిన ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన ట్రేడ్లలో సీట్ల భర్తీ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మందమర్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

ఏసీసీ: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో క్యాంటీన్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలజి మేనేజ్‌మెంట్ ద్వారా ఇటీవల శిక్షణ పూర్తిచేసుకోగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. క్యాంటీన్‌ల యూనిట్లకు గానూ లక్సెట్టిపేటకు చెందిన జమున, హాజీపూర్‌కు చెందిన జ్యోతి, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో గుడిపేటకు చెందిన ధనలక్ష్మికి కలెక్టర్ చేతులమీదుగా సంబంధిత శిక్షణ ధ్రువపత్రాలు అందుకున్నారు.

ఉద్యాన నర్సరీ స్థలం కబ్జాకు యత్నం

భీమారం, న్యూస్‌టుడే : జైపూర్ మండల కేంద్రంలోని 63వ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఉద్యాన నర్సరీ స్థలాన్ని గేటు తాళం వేసి ఉండగానే గురువారం కొందరు వ్యక్తులు చదును చేస్తుండగా విషయం తెలుసుకుని తహసీల్దార్ వనజారెడ్డి అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నెం.94లో సుమారు 8 ఎకరాల స్థలంలో 50 ఏళ్లుగా నర్సరీగా ఉంటుండగా రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి తనదేనని జేసీబీ, ట్రాక్టర్లతో వచ్చి చదును చేస్తుండగా వచ్చి అడ్డుకున్నామని తెలిపారు. పూర్తి విచారణ చేపట్టి సర్వే నిర్వహించేవరకు ఎవరూ అక్కడికి రావద్దని హెచ్చరించారు.

ఎన్ఎల్ఎం బృందం పర్యటన

మంచిర్యాల పట్టణం: హాజీపూర్ మండలంలోని బుద్ధిపెల్లి, గ్రామపంచాయతీలో గురువారం నేషనల్ లెవల్ మానిటర్స్ బృందం (ఎన్ఎల్ఎం టీం) ప్రతినిధులు కేహెచ్ సునీల్, సీవీ బాలమురళి, పర్యటించారు. గ్రామ పంచాయతీలో రికార్డులు, క్యాష్ బుక్స్, పెన్షన్లు, జనాభా లెక్కలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. అనంతరం నర్సరీ, జీపీ బిల్డింగ్, బావి పూడిక, ప్లాంటేషన్ పనులను పర్యవేక్షించారు.

ముగిసిన ఆటల పోటీలు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : గుడిపేటలోని టీజీఎస్పీ 13వ బెటాలియన్ పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణ కానిస్టేబుళ్లకు నాలుగు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. కానిస్టేబుళ్లను వివిధ గ్రూపులుగా విభజించి 100 మీటర్లు, 800 మీటర్లు, 5 కి.మీ, 10 కి.మీ రన్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు బహుమతులు అందజేశారు.

సాగు పద్ధతులను పాటిస్తే అధిక లాభాలు

కాసిపేట, న్యూస్‌టుడే : సాగు పద్ధతులను పాటిస్తూ పత్తి పంట సాగు చేసుకుంటే అధిక లాభాలను పొందవచ్చని శాస్త్రవేత్త ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. పత్తి క్షేత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్, కృషి విజ్ఞాన్ కేంద్రం బెల్లంపల్లి ఆధ్వర్యంలో కాసిపేట మండలంలోని సండ్రలపాడ్ గ్రామంలో అధిక సాంద్రత పత్తిలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించి, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా పత్తి ఉత్పాదకతను పెంచేలా జిల్లా వ్యాప్తంగా 187 ఎకరాలలో రైతు క్షేత్ర ప్రదర్శనలు చేస్తున్నామని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త సునీల్ మహాజన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, తిరుపతి, నరేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు



జైపూర్‌లో పాల్గొన్న సింగరేణి, ఎస్టీపీపీ అధికారులు



నస్పూర్‌లో కమిషనర్ సతీష్, ఛైర్మన్ వేణు



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకట రాములు

వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి



క్యాతనపల్లిలో..



దండేపల్లిలో..

తాండూరు, భీమారం, మందమర్రి పట్టణం, నస్పూర్, మంచిర్యాల పట్టణం, రామకృష్ణాపూర్, నెన్నెల, దండేపల్లి న్యూస్‌టుడే : సమాజంలో ప్రతి ఒక్కరూ వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని మార్పును స్వాగతించాలని అధికారులు, నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో పుర అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు మంచిర్యాల యువకుడి పాదయాత్ర



దీక్ష చేపట్టి పాదయాత్రను ప్రారంభించిన వంశీని సత్కరిస్తున్న అర్చకులు, కుటుంబసభ్యులు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : జిల్లా యువకుడు భక్తిభావంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన రోజు నుంచే శబరిమల యాత్రను ప్రారంభించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సుంకి వంశీ గురువారం గుడెంలోని అయ్యప్ప దేవస్థానంలో అర్చకుడు పురుషోత్తమచార్యుల సమక్షంలో మాలధరించి అక్కడి నుంచే తన పాదయాత్రను మొదలుపెట్టారు. 41 రోజుల ఈ దీక్షను ఈ యాత్రలోనే పూర్తిచేయనున్నట్లు వంశీ తెలిపారు. ఆయా రోజుల్లో సుమారు 2 వేల కిలోమీటర్లు నడక సాగిస్తామని, శబరి ఆలయానికి చేరుకుని, దీక్ష విరమిస్తామని చెప్పారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని నిరసన



ఐబీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 14 నుంచి ప్రైవేటు కళాశాలలు తెరుచుకోవడం లేదు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల విడుదల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై గురువారం ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం అసోసియేషన్, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌ను కలిసి సమస్యలను వివరిస్తూ వినతిపత్రాలను అందజేశారు. విద్యాసంస్థల నిర్వాహకులు నర్సయ్య, రమణ, శ్రీధర్, చంద్రమోహన్, మల్లయ్య, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, తిరుపతి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి పుర పరిధిలోని ప్రభుత్వ భూములను రక్షించాలని పుర ఛైర్‌పర్సన్ జంగం కళ కోరారు. గురువారం క్యాతనపల్లి పుర కార్యాలయంలో కమిషనర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

శ్రీరాంపూర్ గ్రామీణం : పట్టభద్రుల ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులైన కార్మికులందరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు పేర్కొన్నారు. గురువారం రవీంద్రఖని-7, రవీంద్రఖని-న్యూటెక్ గనులను సందర్శించారు.

■ సకాలంలో వినియోగదారులకు బొగ్గు రవాణా



శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : గనుల నుంచి వెలికి తీసిన బొగ్గు సకాలంలో వినియోగదారులకు చేరవేయాలని సింగరేణి సంచాలకుడు (ప్రాజెక్టు, ప్రణాళికలు) జి.వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించిన ఆయన ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి క్వారీలోని పని స్థలాలను పరిశీలించారు. అనంతరం అధికారులు, ఓబీ గుత్తేదారుల సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు టి.శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, చిరంజీవులు, అరవిందరావు, వరలక్ష్మి, బ్రహ్మాజీ, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, సంపత్ తదతరులు పాల్గొన్నారు.

■ బీఎంఎస్ ఏరియా కార్యదర్శిగా రాజేందర్

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా రాగం రాజేందర్ నియామకమయ్యారు. గురువారం సంఘం కార్యాలయంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి సమక్షంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏరియా కార్యదర్శితోపాటు డివిజన్ కార్యదర్శులుగా గొల్ల మహేందర్, శాంతం సంపత్‌ను నియమించారు.

■ ప్రభుత్వ అండతో కార్మికులకు మేలు

శ్రీరాంపూర్ గ్రామీణం : రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడంతో కార్మికులకు మేలు జరుగుతుందని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్-3, 3ఏ గనిని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సంస్థలో రాజకీయ జోక్యంతో నష్టం జరుగుతుందని ఇతర సంఘాల నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఉత్తర్వులను రద్దు చేయాలి

మందమర్రి పట్టణం : సింగరేణి కార్మికులు ఏదైనా కారణాల చేత మూడు రోజులు విధులకు గైర్హాజరు అయితే ఏరియా జీఎం అనుమతి తీసుకోవాలని జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

కళ్యాణిఖని (మందమర్రి పట్టణం) : సింగరేణి కార్మికుడు మూడు రోజులు లీవ్ పెట్టకుండా విధులకు గైర్హాజరు అయితే జీఎంను కలిసి అనుమతి తీసుకుని విధులకు రావాలనే నిబంధనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి కేకే5 గనిపై ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు.

■ ఘనంగా వాల్మీకి జయంతి

శ్రీరాంపూర్ గ్రామీణం: జీఎం కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జీఎం బి.సంజీవరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

■ విజేతగా రామగుండం రీజియన్ జట్టు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 డివిజన్‌లో జరిగిన 53వ జోనల్ స్థాయి రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్జీ-2, 3 ఏపీఏ జట్టు.. ద్వితీయ స్థానం భూపాలపల్లి, తృతీయస్థానంలో బెల్లంపల్లి-మందమర్రి జట్లు నిలిచాయి. ఉత్తమ నైపుణ్యంలో శ్రీరాంపూర్ డివిజన్, ప్రథమ చికిత్సలో మందమర్రి డివిజన్‌లు ఉన్నాయి. ఉత్తమ రికవరీలో మందమర్రి, బెల్లంపల్లి, ఉత్తమ రెస్క్యూ రికవరీలో ఆర్జీ-2, 3, ఏపీఏ జట్టు, ఉత్తమ కెప్టెన్‌గా అనిల్‌కుమార్, ద్వితీయ స్థానంలో పూర్ణచందర్ విజేతలుగా నిలిచారు.

సంక్షిప్తం

■ ఎండీబీఏ ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సుధాకర్

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ తొలి ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి సుధాకర్ నియామకమయ్యారు. సంబంధిత ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ జారీ చేసినట్లు గురువారం ఆయన తెలిపారు.

■ విద్యుత్తుశాఖ చెన్నూరు ఏడీఈగా బాలకృష్ణ

చెన్నూరు గ్రామీణం: విద్యుత్తుశాఖ చెన్నూరు ఏడీఈగా డి.బాలకృష్ణ గురువారం చెన్నూరులోని విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం చెన్నూరు ఏడీఈగా పనిచేసిన రవికుమార్ బెల్లంపల్లి గ్రామీణకి బదిలీకాగా మంచిర్యాలలో కమర్షియల్ ఏడీఈగా విధులు నిర్వర్తించిన బాలక్రిష్ణ చెన్నూరుకు బదిలీపై వచ్చారు.

■ శ్రీరాంపూర్ సీఐ బాధ్యతలు స్వీకరణ

నస్పూర్: శ్రీరాంపూర్ సీఐగా వేణు చందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మోహన్ ఐజీపీ మల్టీజోన్-1 హైదరాబాద్‌కు అటాచ్ చేశారు.

■ మహాధర్నాలో జిల్లా విద్యుత్తు ఆర్టిజన్స్

మంచిర్యాల సిటీ: జిల్లా విద్యుత్తు సంస్థలో ఆర్టిజన్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయా ఉద్యోగులు గురువారం వరంగల్ బాట పట్టారు. ఆ జిల్లాలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన మహాధర్నాలో భాగస్వాములయ్యారు. ఆర్టిజన్స్ కన్వర్షన్‌ను వెంటనే చేయాలని, నూతన నియామకాలు ఆ తర్వాతే చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, తిరుపతి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

■ విత్తన నాణ్యత పరిశీలన

నెన్నెల : మండలంలోని పలు గ్రామాలలో యశోద కంపెనీకి చెందిన సన్నరకం విత్తనాలు నాటి వరి సాగు చేశారు. విత్తనాలు నాణ్యత లేకపోవడంతో రైతులు కంపెనీకి ఫిర్యాదు చేయడంతో కంపెనీ ప్రతినిధులు మండల కేంద్రంలోని సంబంధిత రైతుల పొలాలను సందర్శించారు. నాణ్యతను పరిశీలించి నివేదికను పంపిస్తామని చెప్పారు.

■ ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

కోటపల్లి: ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై గురువారం కోటపల్లి మండలంలోని రైతులకు సంబంధిత అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించారు. పత్తి, వరి పంటలే కాకుండా పంటమార్పిడి పద్ధతి ద్వారా ఆయిల్‌పామ్ సాగును ఎంచుకొని లాభాలు పొందవచ్చని డీహెచ్ఎస్ఓ అనిత, మ్యాట్రిక్స్ సీఈఓ ఉదయ్ కుమార్ రైతులకు సూచించారు.

■ కొనసాగుతున్న యువతి ధర్నా

నెన్నెల: నెన్నెల మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఓ యువతి గొల్లపల్లిలో తనను నమ్మించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి ఇంటి ముందు 13 రోజులుగా ధర్నా చేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న మానవ హక్కుల సంఘం ప్రతినిధి లీలా దేవి సందర్శించి పరామర్శించారు. భాజపా మండల అధ్యక్షుడు శైలేందర్ సింగ్, నాయకులు పాల్గొన్నారు.

■ మార్కెట్ భవనానికి గుండా మల్లేశ్ పేరు పెట్టాలి

కాసిపేట : బెల్లంపల్లి నూతన కూరగాయల మార్కెట్ సముదాయ భవనానికి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత గుండా మల్లేశ్ భవనంగా నామకరణం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అడెపు రాజమౌళి అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం, మున్సిపల్, తహసీల్ కార్యాలయంలో అధికారులకు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సరోజ, పూర్ణిమ, నరసయ్య, మల్లేశ్, లక్ష్మీనారాయణ, బాపు, చంద్రమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

■ యజమానికి జరిమానా

మందమర్రి పట్టణం: మందమర్రి కనుకదుర్గ వైన్స్ దుకాణం పక్కన సిట్టింగ్ దుకాణం నిర్వహిస్తున్న యజమానికి గురువారం పురపాలిక అధికారులు రూ.2 వేలు జరిమానా విధించారు.

■ చీరల పంపిణీలో గందరగోళం

కాసిపేట : గత ప్రభుత్వం అందించిన చీరలనే ముఖ్యమంత్రి ఫొటో మార్చి పంపిణీ చేస్తున్నారని మహిళలు సిబ్బందిని నిలదీశారు. మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీలో నూతనంగా ప్రభుత్వం మహిళ సంఘాలకు అందజేస్తున్న చీరల పంపిణీలో గురువారం గందరగోళం నెలకొంది. ఐకేపీ సిబ్బంది గత ఏడాది చీరలను అందిస్తున్నారని సిబ్బందిని నిలదీయడంతో పంపిణీ నిలిపివేశారు.

■ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించవద్దు

మంచిర్యాల పట్టణం : డిజిటల్ క్రాప్ సర్వే చేయకుంటే ఉద్యోగంలో నుంచి తొలగిస్తామని ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై ఒత్తిడి చేయవద్దని కోరుతూ ఏఈఓలు గురువారం గుడిపేటలో వ్యవసాయ అధికారి కల్పనకు వినతి పత్రం అందజేశారు.

■ గూడెంలో భక్తజన సందడి

దండేపల్లి : పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ దేవస్థానం పరిసరాల్లో భక్తజన సందడి నెలకొంది. గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి... గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

జన్నారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ గురువారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందులను పరిశీలించారు. కాలం చెల్లిన మందులేమైనా ఉన్నాయా అనే కోణంలో మందు సీసాలను పరీక్షించారు.


పూలతో కనువిందు చేస్తున్న యాపల్‌గూడ పాఠశాల


ఆకట్టుకుంటున్న బడి తోట


పాఠాలు వింటున్న విద్యార్థులు

ప్రకృతి ఒడి.. చదువులమ్మ బడి

ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని చెట్ల నీడ, పల్లెటూరి గాలితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వివిధ రకాల పూలమొక్కలతో పాటు అలంకరణ మొక్కలు పెంచారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంరక్షిస్తున్నారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తున్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీపై వివిధ అక్షరాలు, సామెతలు, మహనీయుల చిత్రాలను గీయించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా తయారు చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉంది. రూ.లక్ష ఖర్చుతో వెయ్యి పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఈ బడికి స్వచ్ఛ విద్యాలయ పురస్కారం లభించింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగన్న, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యుల అంకితభావం తోడు కావడంతో ప్రైవేటు పాఠశాలకు దీటుగా చదువు, వసతులతో ఆదర్శంగా నిలుస్తోంది. ఒకప్పుడు 120 మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 310 మందితో ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతోంది. జైనథ్ నుంచి కూడా ఈ పాఠశాలకు చదువుకోవడానికి విద్యార్థులు వస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



సొరకాయ @ 4 అడుగులు



సొరకాయ సాధారణంగా ఒక అడుగు లేదా రెండు అడుగుల పొడవు ఉంటుంది. కుమురం భీం జిల్లా కెరమెరికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్ పంట చేనులో నాలుగు అడుగుల పొడవైన సొరకాయ కాసింది. కాయను సదరు రైతు ఇంటికి తీసుకెళ్తుండగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌టుడే, కెరమెరి (జైనూర్)

అడుగులు తడబడి.. ఆగిన ఊపిరి

● నీటి బకెట్‌లో పడి పది నెలల బాలుడి దుర్మరణం



వాంకిడి, న్యూస్‌టుడే: బుడి బుడి అడుగులు వేస్తున్న కుమారుడిని చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులకు.. అవే అడుగులు తీవ్ర గుండెకోతను మిగిల్చాయి. పశువులను పట్టుకునేందుకు అల్లరుముద్దుగా పెంచుకుంటున్న అంతలోనే విగతజీవిగా మారేసరికి తల్లడిల్లిపోయారు. పది నెలల వయసులోనే నూరేళ్లు నిండిన చిన్నారి మరణం ఆ కుటుంబాన్ని విషాదంలో నెట్టింది. వాంకిడి మండలంలో ఓ చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృత్యువాత పడ్డ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజాపూర్ గ్రామానికి చెందిన చౌదరి గిర్జాజీ-సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు తన్వీర్ (పది నెలల వయసు) ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గిర్జాజీ వ్యవసాయ పనులకు వెళ్లగా సునీత ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో తన్వీర్ ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడిపోయాడు. కుమారుడు కనిపించకపోయేసరికి తల్లి ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూంలోని బకెట్‌లో విగతజీవిగా కనిపించాడు. వెంటనే ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నీటిలో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోశెట్టి తెలిపారు.

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ

● కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు లబ్ధి



కోటపల్లి మండలం రాపన్‌పల్లిలో చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

చెన్నూరు గ్రామీణం, ఏసీసీ, న్యూస్‌టుడే : కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు డిసెంబరులో ముగియనుండటంతో ఇటీవల భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం ఈ నెల 9న ఆమోదం తెలపడంతో లక్షలాది మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,60,627 ఆహార భద్రతకార్డులు ఉండగా.. 23,93,693 మంది లబ్ధిదారులు ఉన్నారు. కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు నెలకు అయిదుకిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పొందుతున్నాడు. ప్రభుత్వం ప్రతినెల సుమారు 19,709.60 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

ఆహార భద్రత కార్డుదారులకు కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన పోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.



ఉమ్మడి జిల్లాలో చౌకధరల దుకాణాల వివరాలు

● జిల్లా ● రేషన్ దుకాణాలు ● రేషన్ కార్డులు ● లబ్ధిదారులు

జిల్లా	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు	లబ్ధిదారులు
ఆదిలాబాద్	356	1,92,078	6,42,429
కుమురంభీం	314	1,40,029	4,63,010
మంచిర్యాల	423	2,19,723	6,43,358
నిర్మల్	412	2,08,797	6,44,896

ఎలాంటి ఉత్తర్వులు అందలేదు

ఉచిత బియ్యం పంపిణీని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. బియ్యం పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- (బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మంచిర్యాల

నీటి పారుదల శాఖకు కొత్తగా 52 మంది ఏఈఈలు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 52 మందిని కేటాయించగా, ఆదిలాబాద్ జిల్లాకు 8, నిర్మల్‌కు 16 మంది, మంచిర్యాలలో 12, కుమురం భీం జిల్లాకు 16 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన ఏఈఈలను జిల్లాల వారీగా కేటాయించడంతో పాటు ఆయా సబ్‌డివిజన్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల వారీగా కొత్తగా ఏఈఈలు రావడంతో నీటి పారుదల శాఖ పరిధిలో పనులు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

చిగురిస్తున్న ఆశలు



● రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. దున్నడం మొదలు పంట నూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నారు.

✷ వ్యవసాయశాఖపరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

● జిల్లా ● రైతులు (లక్షల్లో) ● వరిసాగు విస్తీర్ణం ● పత్తి సాగు

జిల్లా	రైతులు (లక్షల్లో)	వరిసాగు విస్తీర్ణం	పత్తి సాగు
మంచిర్యాల	1.45	1,80,567	1,21,704
ఆదిలాబాద్	1.22	1,984	3,87,213
నిర్మల్	1.54	95,824	1,37,390
కుమురం భీం	0.97	58,904	2,98,779

యంత్రాలివే..

రాయితీపై అందించే యంత్రాల్లో రోటావేటర్లు, కల్టివేటర్, దమ్ముచక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు రాయితీపై అందనున్నాయి.

తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచారలోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదైమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.


చెట్టు కింద పడి ఉన్న గొర్రెలు, మేకల కళేబరాలు

పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు మృతి

సారంగాపూర్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాసింగ్‌తండా సమీపంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చవాన్ ఇనేష్ అనే రైతు తన గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లాడు. భారీ వర్షం కురవడంతో జీవాలను ఓ చెట్టు కిందకు చేర్చాడు. అదే సమయంలో పిడుగు చెట్టుపై పడటంతో అక్కడ ఉన్న 60 గొర్రెలు, 5 మేకలు మృతి చెందాయి. స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

అమ్మాయిలు.. పతక విజేతలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :

ఒకవైపు పేదరికం.. మరోవైపు క్రీడలంటే ఇష్టం.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ బాలికలు రాష్ట్ర, సొసైటీ క్రీడలు, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.. పతకాలు సాధిస్తున్నారు.. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు.. ఆల్‌రౌండర్లుగా గుర్తింపు తెచ్చుకుంటున్న వీరంతా జట్టు గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారు.. క్రీడా విభాగంలో ప్రభుత్వ కొలువులు సాధించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు.


కబడ్డీ ఆటలో తలపడుతున్న బాలికలు

క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని.

- సిడాం తుక్కరాణి



మాది ఆదిలాబాద్. ఇంద్రవెల్లిలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఎనిమిదో తరగతి నుంచి కబడ్డీ ఆడుతున్నా. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. ఉత్తమ డిఫెండర్‌గా, రైడర్‌గా పురస్కారం అందుకున్నా. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పసిడి పతకం సాధించాలని, క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నా.

ప్రో-కబడ్డీలో ఆడాలని..: ఆర్.అనూషా



మాది తలమడుగు మండలం సుంకిడి గ్రామం. అక్కడే జడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. పీడీ నాందేవ్ శిక్షణలో మంచి రైడర్‌గా ప్రావీణ్యం పొందా. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని, ప్రో-కబడ్డీ పోటీల్లో ఆడాలని ఉంది. పాఠశాల సెలవు అనంతరం రోజూ రెండు గంటలు సాధన చేస్తున్నా.

సైన్యంలో చేరాలని..: టేకం అంజలి



మాది రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామం. ఇచ్చోడలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో పదో తరగతి చదువుతున్నా. మూడేళ్లుగా కబడ్డీ ఆట ఆడుతున్నా. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. సైన్యంలో చేరాలన్న తన చిన్నప్పటి కలను సాకారం చేసేందుకు కబడ్డీ కోర్టులో తీవ్రంగా శ్రమిస్తున్నా. ఆ ఆటలోని మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నా.

● జాతీయస్థాయి కబడ్డీలో రాణింపు

పోలీసు కావాలని..

- బి.సోనాలి



మాది ఇంద్రవెల్లి. ఆదిలాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. నిజామాబాద్, గజ్వేల్, సూర్యాపేట, హనుమకొండ, మంచిర్యాల ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. బిహార్, రాజస్థాన్, ఝార్ఖండ్ వేదికల్లో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఒకసారి ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. క్రీడా విభాగంలో పోలీసు కావాలనే లక్ష్యంతో తీవ్రంగా సాధన చేస్తున్నా.

బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి బాధ్యతల స్వీకరణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇది వరకు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పని చేసిన వెంకటరమణ, పరిపాలన విభాగం అధికారి రణధీర్‌లు స్వాగతం పలికారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చి పరిశీలిస్తానన్నారు.


ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపకులపతి వెంకటరమణ

ప్రమాదాల దారి.. పర్యవేక్షణ ఏది?

● ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే మేలు

ఈటీవీ - ఆదిలాబాద్ :

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఐఏ) విభాగం నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ - నిర్మల్ మధ్య ఉన్న 44వ నెంబరు జాతీయ రహదారి రక్తమోడుతోంది. నిర్మల్ కేంద్రంగా ఉండే ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) కార్యాలయం కరోనా సమయంలో కామారెడ్డికి మారింది. అప్పటి నుంచి నిర్మల్ జిల్లా సోన్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డొల్లార వరకున్న 115 కి.మీ. రహదారి నిర్వహణపై ఆ శాఖ పర్యవేక్షణ లేకుండాపోయింది.

✷ తాజాగా ఈ నెల 6న జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రహదారిపైనే లారీని నిలిపారు. పొగమంచు కారణంగా లారీని పసిగట్టలేక ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆదిలాబాద్ శాంతినగర్ విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందటం విషాదానికి దారితీసింది.

రోడ్డుపై వాహనాలు నిలపరాదు. ఎన్‌హెచ్ అనుమతి లేకుండా రహదారిని ఆనుకొని దాబాలు నిర్వహించరాదు. అనుమతి ఉంటే రోడ్డుకు ఆనుకొని 10 మీటర్ల స్థలం వదిలేసి ప్రవేశం(ఎంట్రీ), నిష్క్రమణ(ఎగ్జిట్) మార్గాలుండాలనే నిబంధనలు అమలుకాక ప్రమాదాలకు దారితీస్తోంది.



నిర్మల్ జిల్లా గంజాల్, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ దగ్గర ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలు ద్వారా ఎన్‌హెచ్ విభాగం డబ్బులు వసూలు చేయటానికి అనుమతిచ్చిందే తప్పితే ప్రమాదాలకు కారణాలపై దృష్టి పెట్టడం లేదు. నిర్మల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని మూడు టోల్ ప్లాజాల ద్వారా సగటున రోజుకు 10 వేల వాహనాల రాకపోకలు జరుగుతాయనేది అంచనా. ఒక్కో ప్లాజాకు రూ.40 లక్షల చొప్పున మూడింటి ద్వారా రూ.1.20 కోట్లు వాహనదారులు చెల్లించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం టోల్ వసూళ్లకు అనుమతిస్తున్న అధికారులు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవటం రహదారి నిర్వహణను చూసే గుత్తేదారులకు కలిసొస్తోంది.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నేరడిగొండ టోల్ ప్లాజా దగ్గర రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉన్న దృశ్యమిది. గంజాల్, పిప్పర్‌వాడ సహా రోడ్డును ఆనుకొని ఉన్న ప్రతి దాబా దగ్గర ఇదే పరిస్థితి. కొన్ని దాబాల్లోనైతే మద్యం తాగి, భోజనాలు చేస్తున్నా ఎన్‌హెచ్, పోలీసు, ఆబ్కారీ శాఖాధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ ఏడాది జనవరి 8న మావల బైపాస్ దగ్గర అపసవ్య దిశలో వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో ఆదిలాబాద్‌కు చెందిన అఖిలేష్(29) మృతి చెందారు.



చేయాల్సిందేమిటి?

✷ ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆబ్కారీ అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అన్వేషించాలి.

✷ కామారెడ్డి ఎన్‌హెచ్ పీడీకి అనుబంధంగా ఆదిలాబాద్, నిర్మల్ కేంద్రాలుగా డివిజన్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి.

✷ దాబాల్లో మద్యం, గంజాయి వినియోగాన్ని అరికట్టాలి.

✷ 25 కి.మీ.లకు ఒక అంబులెన్సును అందుబాటులో ఉంచాలి.

✷ 2012లో చేసిన సర్వేలో గుర్తించిన 53 ప్రమాద పాయింట్లలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది వెల్లడించాలి.

✷ గుడిహత్నూర్-జందాపూర్, గిమ్మ బైపాస్ దగ్గర వంతెనలు సహా రెండు వైపులా సర్వీసు రోడ్లు అందుబాటులోకి తేవాలి.

☛ గత నెల 30న అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి దగ్గర జరిగిన ప్రమాదంలో మహ్మద్ ఉస్మాన్ ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ, సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్, మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మృతి చెందారు. వీరంతా ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందినవారు.

ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నస్పూర్, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్ రమేష్, క్రీడా సమాఖ్య కార్యదర్శులు ఫణిరాజా, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన క్రైస్తవులు

అందరూ దైవ సమానులే: మంత్రి సీతక్క


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, న్యూస్‌టుడే: కులమతాల మధ్య భేదాలు సృష్టించుకోవద్దని, అందరూ దైవ సమానులే అని మంత్రి సీతక్క అన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెం లోని కల్వరి చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్ష ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దాదాపు లక్ష పైచిలుకు క్రైస్తవ భక్తులతో సభ ప్రాంగణం నిండిపోయింది. ప్రపంచ శాంతి కోసం ఏటా 50 రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతున్నట్లు పాస్టర్ ప్రవీణ్ చెప్పారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఈ ఉపవాస దీక్షతో తమ ప్రాంతం దేశం మొత్తం తెలిసిందన్నారు. ప్రపంచ స్థాయిలో కల్వరి ఇంతలా పేరు సాధించడం సంతోష కారణమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, రవికుమార్, నాతరి స్వామి, రాంచందర్ తదితరులున్నారు.